సాక్షి ఒడిశా

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,91,041లు, బంగారం 400 మిల్లీగ్రాములు, వెండి 15 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

చిక్కుల్లో ఎమ్మెల్యే ప్రతాప్ జెనా



కటక్ జిల్లా మహంగా అసెంబ్లీ నియోజకవర్గంలో 2021లో తీవ్ర సంచలనం రేపిన జంటహత్య కేసు మరోసారి తెరపైకి వచ్చింది. దీంతో ఈ కేసులో నిందితుడిగా ఉన్నటువంటి ప్రతాప్ జెనా చిక్కుల్లో పడ్డారు.

- 8లో.



భక్తిశ్రద్ధలతో పూజలు

- 8లో.

న్యూస్‌రీల్

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



తోటపల్లి డ్యామ్ వద్ద తేలుతున్న అశోక్ మృతదేహం

అశోక్ కుమార్ (ఫైల్)

రాయగడ: ఈనెల 20వ తేదీన స్థానిక చెక్కాగుడ సమీపంలోని జంఝావతి నదిలో వినాయకుని నిమజ్జనం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం, ఆంధ్రప్రదేశ్‌లోని మన్యం జిల్లా పార్వతీపురం తోటపల్లి డ్యామ్‌లో సోమవారం లభ్యమైంది. మృతుడు స్థానిక మంకొడొజొల గ్రామానికి చెందిన శ్రీనివాస్ అశోక్ కుమార్ (32)గా నిర్ధారించారు. తోటపల్లి డ్యామ్ వద్ద మృతదేహం కనిపించిందని తెలుసుకున్న గరుగుబిల్లి పోలీసులు అక్కడికు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వివరాలు సేకరించి రాయగడ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాధిత కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించారు. తల్లితో కలిసి వినాయక నిమజ్జనం చేసేందుకు వెళ్లిన అశోక్ ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడి గల్లంతైన విషయం తెలిసిందే.

నకిలీ మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లతో అరెస్టైన వ్యక్తి

బరంపురం: ఇటీవల బరంపురం ఎక్సైజ్ అధికారులు భారీగా విదేశీ నకిలీ మద్యం పట్టుకున్న విషయం తెలిసిందే. తాజాగా సోమవారం జిల్లాలోని చమ్మఖండి పోలీసుస్టేషన్ పరిధి బొనుగునాపల్లి గ్రామంలో ఒక కారులో అక్రమంగా నకిలీ మద్యంను తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి బాటిళ్లు స్వాధీనం చేసుకొని, స్కూటీని సీజ్ చేశారు. అరెస్టైన వ్యక్తి మాణిక్ కుమార్‌గా పోలీసులు నిర్ధారించారు.


అంతరాష్ట్ర సైబర్ నేరస్తుడు అరెస్టు



సైబర్ నేరస్తుడిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సైబర్ నేరస్తుడిని బరంపురం పోలీసులు అరెస్టు చేసిన విషయం జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాలు మేరకు.. ఈనెల 8వ తేదీన డెబిట్ కార్డుతో రూ.95 వేలు నగదు కాజేసిన ఘటనపై బరంపురం పోలీసులు ఫిర్యాదు నమోదు చేశారు. ఈ మేరకు ఐఐసీ ప్రశాంత్ భూపతి నేతృత్వంలో సైబర్ పోలీసు బందం దర్యాప్తు చేపట్టి నేరస్తుడు అఫ్జల్‌ను ఆదివారం అరెస్టు చేశారు. అతని వద్దనుంచి 2 సెల్‌ఫోన్లు, రూ.95 నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వ్యక్తి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన దేవగడా జిల్లా కారగ్ పోలీసుస్టేషన్ పరిధి నాగద్రీ గ్రామానికి చెందినవాడిగా వెల్లడించారు. అతడిని జిల్లా కోర్టులో హాజరుపరిచారు.

నాలుగు టిప్పర్లు సీజ్



పోలీసులు సీజ్ చేసిన టిప్పర్లు

రాయగడ: జిల్లాలోని టికిరి సమితి దొరాగుడ వద్దనున్న ఉత్కళ అలూమిన కర్మాగారం నుంచి కొరాపుట్‌కు ఫ్లైయాష్ లోడ్‌తో వెళ్తున్న నాలుగు టిప్పర్లను ఆదివారం సాయంత్రం పోలీసులు సీజ్ చేశారు. సామర్థ్యానికి మించి ఓవర్ లోడ్‌తో వెళ్తుండడంతో కేసు నమోదు చేసి టిప్పర్ల యజమానులకు నోటీసులు పంపించారు. ఈ మేరకు నాలుగు టిప్పర్లకు రూ.1.44 లక్షల ఫైన్ వేశారు. అధిక లోడ్‌తో వెళ్లే లారీలు, టిప్పర్లు వలన ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అలాగే ట్రాఫిక్‌కు సైతం విఘాతం కలుగుతుందనే కోణంలో చర్యలు తీసుకున్నట్లు తెలియజేశారు.

మా ప్రభుత్వం.. ప్రజా ప్రభుత్వం

- ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం
- అందుకే అధికారులతో గ్రీవెన్స్ సెల్
- ప్రజల వద్దకే వెళ్లి వినతుల స్వీకరణ
- సీఎం నవీన్ పట్నాయక్
- రెండో రోజు అసెంబ్లీ సమావేశాలు



సభలో ప్రసంగిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ప్రజా సమస్యల పరిష్కారమే బీజేడీ ప్రభుత్వ ధ్యేయమని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల రెండో రోజు శనివారం సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందన్నారు. కోవిడ్‌కు ముందు భువనేశ్వర్‌లో ప్రజల ఫిర్యాదుల విచారణ నిర్వహణ జరిగేదని తెలియజేశారు. ఆ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు వచ్చి తమ ఫిర్యాదులను సమర్పించేవారని వెల్లడించారు. అప్పట్లో వాటిని పరిష్కరించడానికి పటిష్టమైన వ్యవస్థ ఉండేదన్నారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలో అత్యున్నత స్థాయి కార్యాలయానికి చేరుకోవాలనే ప్రజల ఆశ అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. అయితే కోవిడ్ -19 సంభవించినప్పుడు దాదాపు రెండేళ్ల పాటు ఆంక్షల కారణంగా సీఎం గ్రీవెన్స్ సెల్ మూసి వేయబడిందని, అనంతరం సాధారణ స్థితికి వచ్చిన తర్వాత పునః ప్రారంభించినట్లు చెప్పారు. అయితే కోవిడ్ అనంతరం ఫిర్యాదులు చేయడానికి వచ్చేవారి సంఖ్య తగ్గిందన్నారు. దీంతో తక్కువ వ్యవధిలో రాష్ట్రంలోని అన్ని మండలాలు మరియు పట్టణ, స్థానిక సంస్థలను కవర్ చేయడానికి సీఎం గ్రీవెన్స్ సెల్‌ను ప్రజల వద్దకే తీసుకెళ్లాలని అనుకున్నట్లు వెల్లడించారు.

అన్ని జిల్లాల్లో గ్రీవెన్స్ సెల్

సీఎం గ్రీవెన్స్ సెల్‌ను భువనేశ్వర్‌లో సీఎంవో నిర్వహిస్తుందని, మరియు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో గ్రీవెన్స్ సెల్‌ను సీఎంవో అధికారులు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వెల్లడించారు. 6 నెలల వ్యవధిలో 190 కంటే ఎక్కువ ప్రదేశాల్లో గ్రీవెన్స్ నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ ప్రక్రియలో ప్రజల నుంచి ఇప్పటివరకు 57,442 అర్జీలు సేకరించి, 43,536 అర్జీలను పరిష్కరించడం జరిగిందన్నారు. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా మరియు సాంకేతికతతో నడుస్తోందన్నారు. అన్ని అర్జీలు మరియు చర్యలు తీసుకున్న నివేదికలు, పరిష్కార దశ జొనొ సునాని (ప్రజాభియోగ విచారణ) పోర్టల్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. తదుపరి సమావేశాల్లో వారసత్వ సమస్యలు పరిష్కరించబడ్డాయన్నారు. రాబోయే రెండు మూడు నెలల్లో చాలా వరకు పెండింగ్‌లో ఉన్న చారిత్రాత్మక సమస్యలు పరిష్కృతమవుతాయని వెల్లడించారు.

ప్రభావవంతమైన కార్యక్రమం

గ్రీవెన్స్‌లో అధికారులు పిటీషనర్లకు రాతపూర్వక సమాధానాలు ఇస్తారు మరియు మో సొర్కార్ (నా ప్రభుత్వం) ద్వారా ఈ ప్రక్రియపై ఫోను ద్వారా ప్రజాభిప్రాయాలు నమోదు చేస్తారని సీఎం తెలిపారు. దేశవ్యాప్తంగా ఏ ప్రభుత్వం చేపట్టని ప్రజాభియోగ ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియల్లో ఇది అతిపెద్ద మరియు అత్యంత ప్రభావవంతమైనదని నమ్ముతున్నట్లు స్పష్టం చేశారు. కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సైతం అధికారుల బృందాన్ని ఇలాగే ప్రతి ప్రాంతానికి పంపించి ప్రజల అభిప్రాయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలతోనే త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇప్పుడు ఈ మొత్తం కసరత్తుపై ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలకు సిద్ధమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం గ్రీవెన్స్ సెల్‌ను ఎల్లప్పుడూ సీఎంవో నిర్వహిస్తుంది, దానికి మంత్రులు హాజరవ్వనవసరం లేదన్నారు. అర్జీలు రాగానే సంబంధిత శాఖలకు పంపుతారు. ఇందులో మంత్రులు వర్సెస్ అధికారుల సమస్య ఎక్కడుందని ప్రశ్నించారు. అర్జీల పరిష్కారంలో శాఖాధిపతులుగా మంత్రులే ప్రధాన పాత్ర పోషిస్తారన్నారు.

ప్రజల వ్యయ, ప్రయాసలు తగ్గాయి

అర్జీలను స్వీకరించడానికి ప్రజల వద్దకే సీఎంవో అధికారులు వెళ్తుండడంతో ప్రజల వ్యయ, ప్రయాసలు తగ్గాయని సీఎం చెప్పారు. ప్రజల ఫిర్యాదులను సాధ్యమైనంత ఉత్తమంగా పరిష్కరించడమే లక్ష్యమన్నారు. 57,000 మంది తమ సమస్యలు తెలిపేందుకు భువనేశ్వర్ వచ్చుంటే ఎంత డబ్బు ఖర్చు చేయాల్సి ఉండేదో ప్రశ్నించారు. ప్రజల వద్దకే వెళ్లేందుకు ఛాపర్ వినియోగించడం వలన ఎక్కువ ఖర్చు అవుతోందని విమర్శించడంలో అర్థం లేదన్నారు. చాపర్ వలన ప్రతిరోజూ మూడు నుంచి ఐదు సమావేశాలను వేర్వేరు ప్రదేశాలలో నిర్వహించడం జరుగుతోందన్నారు. గత మూడున్నరేళ్లలో చాపర్ కోసం దాదాపు రూ.40 కోట్లు ఖర్చు చేశాం. అంటే ప్రతినెలా సగటున రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు ఛాపర్ కోసం ఖర్చు చేశామన్నారు. అయితే గ్రీవెన్స్ కోసం గడచిన ఆరు నెలల్లో ప్రజలకు చేరువయ్యేందుకు హెలికాప్టర్‌ను విస్తృతంగా వినియోగించినప్పుడు సైతం సగటున నెలకు రూ.1 కోటి నుంచి 1.5 కోట్ల వరకు ఖర్చు మాత్రమే చేశామన్నారు. ఎప్పటిలాగే అంతే ఖర్చు అవుతున్నా అదనపు వ్యయం చేశామని చెప్పడం సరికాదన్నారు.

నాయకులంతా సంతోషించాలి

అధికారులు గ్రీవెన్స్ నిర్వహిస్తుండడంతో తమ నియోజకవర్గం పరిధిలోని అనేక ఫిర్యాదులు కూడా పరిష్కారమైనందుకు ప్రతిపక్ష సభ్యులు సైతం సంతోషించాలని సీఎం అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారాన్ని ఎవరైనా ఎలా వ్యతిరేకిస్తారో అర్థం కావడం లేదన్నారు. ఇలాంటి వ్యతిరేకత ప్రజలకు వ్యతిరేకమని, అలాంటి వైఖరికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు. రాజకీయాలు కుంటే ప్రజలకు సేవ చేయడానికే ప్రాధాన్యమివ్వాలని సూచించారు. గ్రీవెన్స్ వలన ప్రజలు సంతోషంగా ఉన్నారు, ప్రజాప్రతినిధులు సంతోషంగా ఉన్నారు, రాజకీయ కారణాల వల్ల ప్రతిపక్ష సభ్యులు అసంతృప్తి చెందకూడదని హితవు పలికారు.

రెండుసార్లు సభ వాయిదా



శాసనసభలో రెండో రోజు సమావేశాల దృశ్యం

- ప్రశ్నోత్తరాల సమయంలో గందరగోళం
- బీజేడీ–బీజేపీ మధ్య వాగ్వాదం

భువనేశ్వర్: రెండో రోజు శాసన సభ వర్షాకాల సమావేశాలు రెండుసార్లు వాయిదా పడ్డాయి. సభా కార్యక్రమాలు ఆరంభం కావడంతోనే సభలో చెలరేగిన గోలతో ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం నుంచి సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో స్పీకర్ సభను మొదట ఉదయం 11.30 గంటల వరకు వాయిదా వేశారు. అప్పటికీ పరిస్థితి కుదుట పడకపోవడంతో మరోసారి సాయంత్రం 4 గంటల వరకు సభా కార్యక్రమాలను వాయిదా వేశారు. దీని ప్రభావంతో రెండో రోజు తొలి విడత సమావేశాల్లో ప్రశ్నోత్తరాలకు గండి పడింది. ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభం నుంచే అధికార బీజేడీ, ప్రతిపక్ష బీజేడీ సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొంది. బీజేపీ సభ్యులు సభ మధ్యలో నిరసన తెలుపగా, బీజేడీ సభ్యులు తమ తమ స్థానాల్లో నిలబడి నిరసన తెలిపారు. ఆర్థిక, ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమం, ఉక్కు మరియు గనులు, శాసన సభ వ్యవహారాలు మరియు ప్రజాభియోగాలు మరియు సాధారణ పాలన విభాగాల అంశాలు చర్చను ప్రశ్నోత్తరాల్లో ఖరారు చేశారు. కానీ ఈ సమయంలో విపక్షాలు పెద్దఎత్తున రచ్చ చేశాయి. విపక్ష సభ్యులు స్పీకర్ పోడియం కింద కూర్చొని నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సభను వాయిదా వేయాల్సి వచ్చింది.

ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు...

పదునైన ప్రజా ప్రయోజన శీర్షికలతో విపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ముందస్తుగా సిద్ధమయ్యాయి. శాంతి భద్రతలు, అవినీతి, వరి అమ్మకం సమస్యలు, ఆరోగ్యం, విద్యా విభాగంలో పలు శీర్షికలతో ప్రభుత్వాన్ని చుట్టుముట్టేందుకు కత్తులు నూరుతున్నాయి. 5టీ కార్యదర్శి రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల పర్యటనపై ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు బదులు ఇవ్వకుండా, ప్రతిపాదిత వాయిదా తీర్మానంపై చర్చకు అనుమతించకపోవడంతో ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీ సభ్యులు విరుచుకుపడ్డారు. మంత్రి ప్రధానమా, కార్యదర్శి ప్రధానమా శీర్షికతో బీజేపీ వాయిదా తీర్మానంపై చర్చకు సభలో ప్రతిపాదించింది.

మరోవైపు జాతీయ రహదారి ప్రాజెక్ట్ మరియు కోస్తా హైవే ప్రాజెక్ట్ విషయమై అధికార పక్షం సభ్యులు విజృంభించారు. ఉదయం జరిగిన సమావేశంలో దుమారం చెలరేగడంతో వాయిదా పడిన సభా కార్యక్రమాలు 11.30 గంటలకు ప్రారంభించే సమయానికి సభలో వాతావరణం మరింత వేడెక్కింది. 5టీ కార్యదర్శి రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల పర్యటన పట్ల ముఖ్యమంత్రి సభలో వివరణ ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5టీ కార్యదర్శి పర్యటనల ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) ప్రజలకు చేరువయ్యిందన్నారు. అంతా సీఎంవో సూచనలను పాటిస్తున్నారని పేర్కొన్నారు. నాది ప్రజల ప్రభుత్వం.. నా ప్రభుత్వం ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. దీంతో విపక్షాలు ఆందోళన చేయడంతో అసెంబ్లీని మరోసారి వాయిదా వేసినట్లు స్పీకర్ ప్రకటించారు.

శరవేగంగా ట్రాక్ పునరుద్ధరణ పనులు



జేసీబీతో మట్టి తొలగిస్తున్న దృశ్యం

కొరాపుట్: కొత్తవలస–కిరండోల్ రైల్వేలైన్‌లో ట్రాక్ పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం కొరాపుట్ సమీపంలోని జరతి–మనబార్ రైల్వేస్టేషన్ల మధ్య కొండ చరియలు జారడం వలన పెద్ద ఎత్తున మట్టి ట్రాక్ మీదకి వచ్చిన విషయం పాఠకులకు విధితమే. తొలిరోజు 18 జేసీబీలు మట్టిని తొలగించడానికి ఉపయోగించగా, సోమవారం వాటిని 27కి పెంచారు. సుమారు 50కి పైగా లారీలు మట్టి రవాణాకు నిరంతరం పని చేస్తున్నాయి. సోమవారం సాయంత్రంకి 30 మీటర్ల ట్రాక్ మీద మట్టి తొలగించారు. మరో 170 మీటర్ల ట్రాక్ మీద మట్టి తొలగించాల్సి ఉంది. వాల్తేర్ డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్ ప్రసాద్ సంఘటన స్థలంలో మకాం వేసి పనులు పర్యవేక్షిస్తున్నారు. దీంతో ఈ మార్గంలో నడిచే 10 ప్రయాణికుల రైళ్ల రద్దు కొనసాగుతోంది. తద్వారా విశాఖపట్నం, భువనేశ్వర్, రౌర్కెలా, రాయ్‌పూర్, కోలకత్త పట్టణాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ మార్గంలో ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రం బచేలి, కిరండోల్‌ల నుంచి ముడి ఇనుప రజను విశాఖపట్నం వైపు తరలిస్తారు. అందుకోసం నేషనల్ మైనింగ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ భారీస్థాయిలో రైల్వేకి అద్దె చెల్లిస్తోంది. 58 నుంచి 59 బోగీలు ఉండే ర్యాక్‌కు సుమారు రూ.2.5 కోట్ల అద్దె ఇస్తుంది. అలా రోజుకి సుమారు 17 నుంచి 18 ర్యాక్‌లలో ఇనుప రజను వెళ్తుంటుంది. అంతేకాక పునరుద్ధరణ చర్యలకు కూడా భారీగా ఖర్చు అవుతోంది. ఇలా చూస్తే రోజుకు రావాల్సిన అద్దె, అయిన ఖర్చు రు.50 కోట్లు సుమారుగా వాల్తేర్ డివిజన్ నష్టపోతుంది. ఇప్పటికే రెండు రోజులుగా ఈ నష్టాలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన కేంద్ర ప్రభుత్వంలో రైల్వే ఉన్నతాధికారులకు కూడా ఆవేదన కలిగిస్తోంది. తరచూ కేంద్రం ఈ ఘటనపై ఆరా తీస్తోంది. ఘటన జరిగిన తర్వాత వర్షం పడకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



పునరుద్ధరణ పనులు పర్యవేక్షిస్తున్న వాల్తేర్ డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్

భారీగా గంజాయి స్వాధీనం



బరంపురం: పట్టుబడిన నిందితులతో పోలీసులు



జయపురం: అరెస్టైన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

కొరాపుట్: జిల్లాలో అక్రమంగా తరలిస్తున్న 142 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. లమ్తాపుట్ పోలీసుస్టేషన్ పరిధిలోని కాలేజీ జంక్షన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో ఒక స్కార్పియోలో తనిఖీలు నిర్వహించగా గంజాయి పట్టుబడింది. గంజాయి రవాణా చేస్తున్న జార్ఖండ్ రాష్ట్రం ఈస్ట్ సింగుభూం జిల్లా చకూలియా పోలీసుస్టేషన్ పరిధి కేలాపథర్ గ్రామానికి చెందిన మురళిమోహన్ పాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి సీజ్ చేసి నిందితుడిని జైలుకి తరలించారు.

జయపురం: జయపురం నుంచి రాజస్థాన్‌కు గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సోమవారం తెల్లవారు జామున 26వ జాతీయ రహదారి ఉమ్మిరి ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో పేపరు మిల్లు జంక్షన్ నుంచి రైల్వేస్టేషన్‌కు అనిల్, రాజేష్ అనే ఇద్దరు వ్యక్తులు నడుచుకుంటూ వెళ్తున్నారు. వారిని చూడగానే అనుమానం వచ్చి తనిఖీలు నిర్వహించగా వారి బ్యాగ్‌లలో గంజాయి లభించింది. వెంటనే వారిని అరెస్టు చేసి విచారించగా గంజాయిని రాజస్థాన్ తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. జయపురం నుంచి ట్రైన్‌లో రాయపూర్ వెళ్లి అక్కడ నుంచి రాజస్థాన్ వెళ్లాలనుకున్నట్లు తెలిపారని ఎక్సైజ్ అధికారి దుర్యోధన బిశ్వాల్ వెల్లడించారు. వారి వద్ద నుంచి 20 కేజీల 60 గ్రాముల గంజాయి, రూ.2 వేల నగదు, పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపామని, వారికి జామీను లభించకపోవడంతో జైలుకు పంపినట్లు తెలిపారు.



కొరాపుట్: గంజాయితో పట్టుబడిన స్కార్పియో

బరంపురం: కారులో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న ఘటన జిల్లాలో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాలు మేరకు.. జిల్లాలోని దిగపండి నుంచి బరంపురం వైపు వస్తున్న ఒక కారులో గంజాయి రవాణా అవుతున్నట్లు సోమవారం సమాచారం వచ్చింది. దీంతో హింజికాట్–దిగపండి మరియు బరంపురం మధ్య మూడు రోడ్ల జంక్షన్‌లో వాహనాల తనికీలు నిర్వహించారు. దీనిలో భాగంగా రామకృష్ణ పెట్రోల్ బంకు దగ్గర అనుమానంతో కారులో సోదాలు చేయగా, 4 బస్తాల్లో 82 కిలోల గంజాయి లభించింది. దీంతో కారును సీజ్ చేసి, ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టైనవారు వెస్ట్ బెంగాల్‌లోని మిథనపూర్ జిల్లాకి చెందిన హరదన బెహరా మరియు భిశ్వాజిత్ దాస్‌లుగా గుర్తించారు. అరెస్టైనవారి వద్ద నుంచి రూ.17 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారి గీతాంజి సాహు తెలియజేశారు.

చెరువులో మునిగి వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

జయపురం: సబ్ డివిజన్ కోట్‌పాడ్ సమితి దమణహండి గ్రామ పంచాయతీ సొరిగాం నువాగుడ గ్రామంలో సుకమతి నాయిక్ అనే వృద్ధురాలు సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లింది. అయితే ఎంతసేపటికీ ఆమె ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. ఎట్టకేలకు గ్రామ సమీప చెరువులో సుకమతి నాయిక్ తేలుతూ కనిపించడంతో వెంటనే పోలీసులకు తెలియజేశారు పోలీసులు డాక్టర్‌తో సంఘటన స్థలానికి చేరుకున్నారు. చెరువులో తేలుతున్న వృద్ధురాలిని బయటకు తీసుకొచ్చి పరీక్షించగా అప్పటికే ఆమె మరణించిందని డాక్టర్ ధ్రువీకరించారు. వెంటనే కోట్‌పాడ్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పంపించారు. వృద్ధురాలి దుర్మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

బరంపురం: నగరానికి సమీపంలోని చికిరి గ్రామంలో కొద్ది రోజుల నుంచి రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాపై పోలీసులు దాడిచేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి సుమిత్ సరన్ తెలిపిన వివరాల మేరకు.. హింజిలి కాట్ పోలీసుస్టేషన్ పరిధి చికిరి గ్రామంలో రహస్యంగా జూదం అడ్డా నడుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం రాత్రి జూదం అడ్డాపై దాడిచేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, వారి దగ్గర నుంచి రూ.19,510 నగదు, 7 సెల్‌ఫోన్లు, 7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.



పట్టుబడిన ఏడుగురు పేకాటరాయుళ్లు

క్లుప్తంగా

బస్సులో అటవీశాఖ ఉద్యోగి మృతి


మృతిచెందిన శివ శంకర్

సాలూరు/ పార్వతీపురం టౌన్: విధి నిర్వహణ కోసం బస్సులో వెళ్తున్న కురుపాం అటవీశాఖలో సీనియర్ అసిస్టెంట్ శివశంకర్ గుండెపోటుతో మరణించారు. సాలూరు పట్టణంలోని బంగారమ్మ కాలనీలో నివాసం ఉంటున్న ఆయన విధినిర్వహణ నిమిత్తం సాలూరు నుంచి పార్వతీపురం వెళ్లే బస్సులో సోమవారం ఉదయం వెళ్తుండగా పార్వతీపురం సమీపంలో గుండెపోటుకు గురయ్యారు. బస్టాప్‌కు బస్సు చేరినప్పటికీ ఆయన దిగకపోవడంతో గుర్తించిన ఆర్టీసీ సిబ్బంది వెంటనే 108కు ఫోన్ చేయగా, వారు వచ్చి పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. శివశంకర్ మృతితో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లలకు వివాహాలు అయ్యాయి.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో ట్రాక్టర్ ఢీ కొని ఓ మహిళ మృతిచెందింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన ఏడువాక ముత్యాలమ్మ (53) కళ్లం నుంచి ఇంటికి వస్తుండగా ఎం.శింగవరం నుంచి వస్తున్న ట్రాక్టరు శివాలయం వద్ద ఆమెను వెనుకనుంచి ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయి అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త తాతారావు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు వివాహమైంది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆతవ గ్రామానికి చెందిన నెక్కల ఈశ్వర్రావు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

డబ్బులకోసం బెదిరించిన వ్యక్తుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ ఎస్సైలు భాస్కరరావు, అశోక్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: ఫోన్‌లో మాట్లాడుతూ వెళ్తున్న వ్యక్తిని అడ్డగించి డబ్బులివ్వమని బెదిరించి, చితకబాది, చేతిలో ఉన్న సెల్‌ఫోన్ పట్టుకుని పరారైన ముగ్గురు నిందితులను వన్‌టౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక సీఎంఆర్ జంక్షన్ వద్ద వేకువజామున ఫోన్‌లో మాట్లాడుతూ నడుస్తున్న కోడి రామపృథ్వీ అనే వ్యక్తిని గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు డ్యూక్ బైక్‌పై వచ్చి డబ్బులు డిమాండ్ చేశారు. తనవద్ద డబ్బుల్లేవని చెప్పేసరికి రామపృథ్వీని చితకబాది చేతిలో ఉన్న సెల్‌ఫోన్ లాక్కుని బైక్‌పై వెళ్లిపోయారు. ఈ మేరకు బాధితుడు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. దర్యాప్తులో భాగంగా కేఎల్ పురం జంక్షన్ వద్ద ముగ్గురు వ్యక్తులు డ్యూక్ బైక్‌పై తిరుగుతున్నట్లు తెలుసుకున్న పోలీసులు నాగళ్ల వంశీ, పత్తికాయల అశోక్, యామల కార్తీక్‌లను అదుపులోకి తీసుకుని సెల్‌ఫోన్, డ్యూక్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సైలు భాస్కరరావు, అశోక్‌లు తెలిపారు.

ఫోల్డర్‌లు, బ్యాగుల సరఫరాకు షార్ట్ టెండర్లు

పార్వతీపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయిలో జరుగుతున్న ఆరోగ్య శిబిరాలకు వచ్చే ప్రజలకు కేస్‌షీట్ తయారుచేసేందుకు అవసరమైన ఫోల్డర్‌లు, బ్యాగులు సరఫరా చేసేందుకు షార్ట్ టెండర్లు కోరుతున్నట్లు జాయింట్ కలెక్టర్ గోవిందరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య శిబిరాలకు వచ్చేవారికి లక్ష ఫోల్డర్‌లు, లక్ష బ్యాగులను సిద్ధం చేయాలని ప్రభుత్వంనుంచి ఆదేశాలు వచ్చాయని, ఈమేరకు ఆశక్తిగల ఏజెన్సీల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపా రు. టెండర్ దరఖాస్తును హెచ్‌టీటీపీఎస్://పార్వతీపురంమన్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 26, 27 తేదీలలో కార్యాలయం పనిదినాల్లో సాయంత్రం 5 గంటలలోగా సమర్పించాలని పేర్కొన్నారు. 27 సాయంత్రం 5 గంటల తరువాత జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో టెండర్లు తెరవనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని సుభద్రమ్మవలస, గవరమ్మపేట, రామినాయుడువలస, వెంకటరాజపురం పంట పొలాల్లో సోమవారం సాయంత్రం ఏనుగులు దర్శనమిచ్చాయి. అటవీశాఖాధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఏనుగులు తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు తెలిపారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీని కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తపస్ మండల్, లెఫ్టినెంట్ కల్నల్ పల్లవి వర్మ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ ఎన్‌సీసీ యూనిట్ త్వరలోనే వర్సిటీలో ఏర్పాటవుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిక్కుల్లో ఎమ్మెల్యే ప్రతాప్ జెనా

- జంటహత్య కేసులో ఆరోపణలు
- ప్రత్యేక కోర్టుకు కేసు బదిలీ


ప్రతాప్ జెనా

భువనేశ్వర్: కటక్ జిల్లా మహంగా అసెంబ్లీ నియోజకవర్గంలో తీవ్ర సంచలనం రేపిన జంటహత్య కేసు మరోసారి తెరపైకి వచ్చింది. 2021 జనవరి 2వ తేదీన ఈ హత్య సంఘటన చోటు చేసుకుంది. ఈ కేసులో మహంగా నియోజకవర్గం సిటింగ్ ఎమ్మెల్యే ప్రతాప్ జెనా ఒక నిందితుడు కావడం విశేషం. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా హత్య, హత్య కుతంత్రం, బెదిరింపు ఆరోపణల కింద కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసు విచారణ కొనసాగాలని సాలేపూర్‌లోని ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (జేఎంఎఫ్‌సీ) కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా అభియోగాలు, సాక్షుల వాంగ్మూలం ఇతరేతర దస్తావేజుల్ని ఈ న్యాయస్థానం పరిశీలించింది. ఈ పరిశీలనలో మహంగా జంట హత్యల కేసులో ఎమ్మెల్యే ప్రతాప్ జెనాపై కేసు శిక్షార్హమైనదని కోర్టు నిర్ధారించింది. భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ) సెక్షన్ 302, 506, 120–బీ కింద నేరారోపణలతో నిందితుడు ప్రతాప్ జెనా వ్యతిరేకంగా నమోదైన కేసు ప్రాథమికంగా శిక్షార్హమైనదిగా విచారణలో తేలిందని ఈ కోర్టు స్పష్టం చేసింది. అయితే నిందితుడు సిటింగు ఎమ్మెల్యే కావడంతో విచారణ వ్యవహారాన్ని భువనేశ్వర్ ప్రత్యేక అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి–కమ్–స్పెషల్ కోర్టుకు బదిలీ చేసినట్లు కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కేసు బీజేపీ నాయకుడు మరియు మహంగా ప్రాంతీయులు కులమణి బొరాల్ మరియు అతని సహచరుడు దివ్యసింగ్ బొరాల్ హత్యకు సంబంధించినది. ఈ కేసులో 13 మందికి వ్యతిరేకంగా రమాకాంత బొరాల్ ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వీరిలో సిటింగ్ ఎమ్మెల్యే ప్రతాప్ జెనా ఒకరు. 9 మంది నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు ప్రఫుల్ల బిస్వాల్ కూడా కటక్ జిల్లా టంగి గోవింద్‌పూర్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఏడాది జనవరి నెలలో ఫిర్యాదు చేసిన రమాకాంత బొరాల్ మృతి చెందాడు. ప్రస్తుతం ఈయన తమ్ముడు ఈ కేసు వ్యవహారాల్ని పర్యవేక్షిస్తున్నాడు.

పెట్రోల్ దొంగలున్నారు జాగ్రత్త


బైక్‌లో పెట్రోలు దొంగిలిస్తున్న దుండగులు

జయపురం: సహజంగా అనేక మంది బైక్‌లు, కార్లు పెట్టుకునేందుకు స్థలం లేక తమ ఇళ్ల ముందు వాటిని పార్క్ చేయటం సహజం. అయితే కొద్ది రోజులుగా జయపురంలో కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా పారాబెడ, శ్రీరాంనగర్, సంతోషి మా నగర్, ఝుంకరదేయి మందిర్ 1, 2 లైన్లలో మోటారు బైక్‌లలో పెట్రోలు దొంగిలిస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అటువంటి ఫిర్యాదు జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో సోమవారం నమోదు అయ్యింది. పారాబెడ గ్రామానికి చెందిన ప్రశాంత శతపతి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొంతమంది రాత్రులందు వీధుల్లో తిరుగుతూ గోడలు దూకి బైకుల్లో ఉన్న పెట్రోలు దొంగిలిస్తున్నారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. అలా తమ ఇంటి లోపల ఉన్న బైక్‌లో పెట్రోలు దొంగిలిస్తున్న దృశ్యాలు, సీసీ కెమేరాల్లో రికార్డు అయినట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పెట్రోలు దొంగిలించే దుండగులను పట్టుకునేందుకు అన్ని ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ విస్తరింపజేయాలని యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు.

కార్మికుల ధర్నా

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడిలో ఉన్న ఆక్సైడ్ ప్లాంట్ మూతపడితే తమ జీవితాలు రోడ్డున పడతాయని, కుటుంబాలు రోడ్డున పడకుండా ఆదుకోవాలని కోరుతూ గరివిడిలో ఆర్ఎంఎం అండ్ ఆర్‌బీఎస్ అండ్ డీఎఫ్ఎస్ దాసు కంపెనీలో భాగంగా ఉన్న ఆక్సైడ్ ప్లాంట్ కార్మికులు కోరారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులంతా గరివిడిలో ధర్నా చేసి తహసీల్దార్ కార్యాయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్లాంట్‌లో గత 15 నుంచి 20 సంవత్సరాలుగా 110 మంది వర్కర్స్ పని చేస్తున్నామని, ఈ ప్లాంటును మూసివేసి అందులో పనిచేస్తున్న వర్కర్స్‌ను తొలగించాలని కోరుతూ ప్లాంట్ యాజమాన్యం ప్రభుత్వ అనుమతి కోసం దరఖాస్తు చేసిందన్నారు. ఈ ప్లాంట్ మూసివేస్తే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం ప్లాంటు మూసివేత కోసం చేసుకున్న దరఖాస్తును తిరస్కరించి కార్మికులందరికీ పూర్తి పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎ.గౌరినాయుడు, విశ్వనాథరాజుతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో రాణించిన గురుకుల విద్యార్థి



ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించిన శశాంక్

బొబ్బిలి: గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బొబ్బిలి కోమటిపల్లి జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థి కందికుప్పి శశాంక్ రాణించాడు. 1.51 మీటర్లు హైజంప్ చేసి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. గురుకులంలో 9వ తరగతి చదువుతున్న శశాంక్ పార్వతీపురం మన్యం జిల్లాలోని పాచిపెంట. వ్యవసాయ కుటుంబానికి చెందినవాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ గుణుపూరు పురుషోత్‌తో పాటు గురుకుల సిబ్బంది అభినందించారు.

గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ


పర్లాకిమిడి: గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ తదితరులు


పర్లాకిమిడి: ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

బరంపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయ్ అమృత కులంగా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు అధిక సంఖ్యలో వినతులు వచ్చాయి. సబ్–డివిజన్ పరిధిలోని వివిధ గ్రామల్లో తాగునీరు అందడం లేదని, ప్రభుత్వ పథకాలు అందడం లేదని లబ్ధిదారులు, రహదారులు లేవని, ఉపాధ్యాయుల బదిలీలపై, సర్వశిక్ష అభిజాన్ పేరుపై పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలపై వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో బరంపురం సబ్–కలెక్టర్ అశుతోష్ కులకర్ణి, బీఎంసీ కమిషనర్ సోనాలి జెన్నా, ఎస్డీపీవో తదితరులు పాల్గొన్నారు.


బరంపురం: సమస్యలు వింటున్న సబ్–కలెక్టర్ అశుతోష్ కులకర్ణి తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా బ్లాక్ తరంగడ గ్రామ పంచాయతీ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్‌లు వినతులు స్వీకరించారు. జీబ, మునిసింగి, జామి, తరంగడ గ్రామ పంచాయతీల నుంచి 96 వినతులు అందాయి. వాటిలో వ్యక్తిగతం 61 కాగా, గ్రామ సమస్యలపై 42 ఉన్నాయి. వాటిలో 42 గ్రామ సమస్యలను అక్కడికక్కడే అధికారులు పరిష్కరించారు. ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 వేలు చొప్పున్న ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండల్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు విలేకరులపై ఎఫ్ఐఆర్


అవినీతిపై నినాదాలు చేస్తున్న విలేకరులు

- కలెక్టరేట్ వద్ద జర్నలిస్టుల ధర్నా


మేకలతో కలెక్టరేట్ ఎదుట మీడియా ప్రతినిధుల వినూత్న ప్రదర్శన

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్‌లో ఒడిశా జీవనోపాధుల శాఖ ద్వారా డ్వాక్రా గ్రూపులకు మేకల పంపిణీలో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ప్రసారం చేయడంతో నలుగురు విలేకరులపై పోలీసుస్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీంతో పర్లాకిమిడి గజపతి కలెక్టరేట్ వద్ద ప్రెస్‌క్లబ్, ఇతర మీడియా సంస్థలు సోమవారం ధర్నాకు దిగాయి. ఇంటర్వ్యూకు వెళ్లిన విలేకరులపై పోలీసుస్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేసిన బ్లాక్ లివ్‌లీ హుడ్ అధికారిపై తగు చర్యలు తీసుకోవాలని శనివారం వినతిపత్రం అందజేశారు. అయినా జిల్లా యంత్రాంగం స్పందించకపోవడంతో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. అనంతరం మేకల మెడలో ప్లకార్డులు కట్టి నిరసనకు దిగారు. కలెక్టరేట్ వద్ద ఉన్న ఒడిశా జీవనోపాధుల శాఖ వరకూ మేకలతో నిరసన ప్రదర్శన చేశారు. ధర్నాలో రాయఘడ బ్లాక్ విలేకరులు జితేంద్రపాత్రో, ధనేశ్వర్ నాయక్, విలేకరుల సంఘం అధ్యక్షుడు బిధాన్ చౌదరి, ద్విజేంద్రనాథ్ పాఢి, భాగవత్ పాఢి, తరిణీ పండా, సరోజ్ బిరో, రష్మిరంజన్ మిశ్రా, సంజీవ్ పాణి, బిజయ గౌడో, దిలీప్ పాణిగ్రాహి, సంతోష్ పట్నాయిక్ తదితరులు ఉన్నారు.

సెంచూరియన్‌లో ముగిసిన హ్యాకథాన్ పోటీలు

- విద్యార్థులను అభినందించిన ప్రముఖులు


ముగింపు ఉత్సవాల్లో మాట్లాడుతున్న సెంచూరియన్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు


ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జ్యూరీ సభ్యులు విజయ్‌కుమార్ సాహూ, పూజా విద్యాశంకర్, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో 72 గంటల పాటు నిర్వహించిన హ్యాకథాన్ పోటీలు సోమవారం విజయవంతంగా ముగిశాయి. పోటీల ముగింపు కార్యక్రమంలో వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో స్టార్టప్‌లు, ఉత్పత్తుల అభివృద్ధికి అవసరమైతే రూ.కోటి వరకు పెట్టుబడులు సమకూరుస్తామన్నారు. ఏ మేరకు పెట్టుబడులు పెట్టాలన్నా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. స్టార్టప్ చేపట్టిన వారికి ఎక్కువ ఆదాయ అవకాశాలున్నాయని చెప్పారు. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి మాట్లాడుతూ విద్యార్థులు 72 గంటల పాటు పనిచేసి ప్రాజెక్టులు రూపొందించడం ఆశ్చర్యం కలిగించిందని, విద్యార్థులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

పోటీల్లో 30 ప్రాజెక్టుల ఎంపిక

సెంచూరియన్‌లో 72 గంటల పాటు ఏకధాటిగా జరిగిన హ్యాకథాన్ పోటీల్లో 30 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఎన్ఆర్డీసీ నుంచి డాక్టర్ విజయ్‌కుమార్ సాహూ, నాస్కామ్ నుంచి స్ట్రాటజిక్ ప్లానింగ్ హెడ్ పూజా విద్యాశంకర్, విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి డాక్టర్ ఎంఎస్ ప్రసాద్, ఏపీఐఎస్ నుంచి లావణ్య, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, తదితరులు జ్యూరీ సభ్యులుగా వ్యవహరించి ప్రాజెక్టులను పరిశీలించి ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. విద్యార్థులు బ్లాక్‌చైన్ అండ్ సైబర్ సెక్యూరిటీ, స్మార్ట్ ఎడ్యుకేషన్, స్మార్ట్ ఆటోమేషన్, అగ్రిటెక్, రోబోటిక్ డ్రోన్స్ తదితర అంశాలకు సంబంధించి 51 ప్రాజెక్టులు రూపొందించగా వాటిలో 30 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, గిరిజన విశ్వ విద్యాలయం ప్రొఫెసర్లు శరత్ చంద్ర, ఎన్‌వీ సూర్యనారాయణ, సీతం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్‌లు సన్నీ డియోల్, రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌లో విద్యార్థుల పాత్ర కీలకం


విద్యార్థులతో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి వినోద్‌కుమార్ పర్మార్

డెంకాడ: దేశ భవిష్యత్ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకమని విశాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, కోస్ట్ గార్డ్ రిఫిట్, ప్రొడక్షన్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ పర్మార్ అన్నారు. ఈ మేరకు చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్, ఈఈఈ, ఐటీ, ఈసీఈ, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఇంజినీరింగ్ కెరియర్–అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్ బిల్డింగ్ బ్లాక్‌లు అని చెప్పారు. ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో సాంకేతిక అధికారుల పాత్ర, నిర్వహించాల్సిన విధులపై అవగాహన కల్పించారు. విశాఖ తూర్పుతీరం చీఫ్ స్టాఫ్ టెక్నికల్ ఆఫీసర్ ఎం.కె.పధి మాట్లాడుతూ ఇండియన్ కోస్ట్‌గార్డ్ చరిత్ర, దాని విధులు, రిక్రూట్‌మెంట్ ప్రక్రియ, ప్రయోజనాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.రమేష్, వైస్‌ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, డీన్‌లు సునీల్‌ప్రకాశ్, ఎస్.మోహన్‌కుమార్, టీపీవో ఎంవీవీ భాను, కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు


రాయగడ: లక్షపూల పూజలో పాల్గొన్న మహిళలు


జయపురం: కొత్తవీధిలో...



జయపురం: రైల్వే కాలనీలో...

గణపతి నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు మండపాలకు వెళ్లి బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని గ్రామాల్లో గణపతి విగ్రహాల నిమజ్జనాలు జరిగాయి. యువకులు భారీ విగ్రహాలను వాహనాలపై తరలిస్తూ సందడి చేశారు. మరికొన్నిచోట్ల లడ్డూ వేలంపాట నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


జయపురం: పారాబెడలో పూజలందుకుంటున్న విఘ్నేశ్వరుడు


జయపురం: దొలాయి వీధిలో...


జయపురం: మాలివీధిలో...

క్లుప్తంగా

27న పీజీ సీట్ల అలాట్‌మెంట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పీజీసెట్–2023 సీట్ల అలాట్‌మెంట్ 27న ప్రకటించనున్నారు. కౌన్సెలింగ్ ఇప్పటికే ముగిసింది. సోమవారం ఆప్షన్ల మార్పు సైతం పూర్తయ్యింది. సెట్ ఆంధ్రావిశ్వవిద్యాలయం నిర్వహించింది. రాష్ట్ర విశ్వవిద్యాలయాలు 14, అఫిలియేషన్ కళాశాలల్లో సీట్లు కేటాయిస్తారు. విద్యార్థుల ఆప్షన్, ర్యాంక్, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ఈ ప్రవేశాలు కల్పిస్తారు. జిల్లా విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సులకు ప్రాధాన్యత ఇచ్చారు. 27 సాయంత్రం సీట్లు ప్రకటించనున్నారు. సీట్లు లభించిన విద్యార్థులు 29వ తేదీన కళాశాలలకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణోత్సవం జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఏకాదశి కల్యాణోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. భాద్రపద శుద్ధ ఏకాదశి పర్వదినాన శ్రీ ఉషాపద్మినీఛాయా సమేత సూర్యనారాయణస్వామి కల్యాణమూర్తులను ఉత్సవమూర్తులుగా అలంకరించి స్థానిక అనివేటి మండపంలో ఆగమ శాస్త్ర ప్రకారం కల్యాణం జరిపించారు. రూ.500 చెల్లించి పలువురు భక్త దంపతులు ఈ కల్యాణ సేవలో పాల్గొని స్వామి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అఫిలియేషన్ పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాలల నాలుగో సెమిస్టర్, ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్స్ ఒకటి, మూడు సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ సోమవారం విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్‌లో 17 పీజీ కోర్సులకు సంబంధించి 437 మంది హాజరు కాగా, 392 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంసీఏ మొదటి సెమిస్టర్‌లో 38కి 29 మంది, మూడో సెమిస్టర్‌లో 45కి 42 మంది, ఎంఎస్సీ కంప్యూటర్స్‌లో మొదటి సెమిస్టర్‌లో 27కి 19 మంది, మూడో సెమిస్టర్‌లో 13కి 9 మంది ఉత్తీర్ణత సాధించారు. పీజీ నాలుగో సెమిస్టర్ సబ్జెక్టుల వారీగా పరిశీలిస్తే జువాలజీలో 7కి 7, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్‌లో 5 కి 5, ఎకనామిక్స్‌లో 5 కి 5, ఇంగ్లిష్‌లో 9 కి 9, రూరల్ డెవలప్‌మెంట్‌లో 2 కి 2, తెలుగులో 7 కి 7, ఎంబీఏలో 49 కి 49, ఎంకాంలో 23కి 23, ఎంఈడీలో 31 కి 30, ఎంఎల్ఐఎస్సీలో 10 కి 10, ఎనలిటికల్ కెమిస్ట్రీలో 53కి 41, బయోటెక్నాలజీలో 29కి 29, ఫిజిక్స్‌లో 22కి 19, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 149కి 120, గణితంలో 20 కి 20, కంప్యూటర్ సైన్స్‌లో 12 కి 12, అప్లయిడ్ మ్యాథ్‌మెటిక్స్‌లో నలుగురికి నలుగురు ఉత్తీర్ణత సాధించారు. 15 రోజుల్లోగా విద్యార్థులు రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఫలితాలు జ్ఞానభూమి వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచారు. మార్కుల జాబితాలు, ప్రొవిజనల్ ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేస్తున్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



చక్కగా అలంకరించిన పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులు

జలుమూరు: భాద్రపద మాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా శ్రీముఖలింగంలోని స్వామికి సోమవారం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామి వారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను చక్కగా అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు.

జిల్లాలో ఆర్మీ మేజర్ జనరల్ పర్యటన

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆర్మీ మేజర్ జనరల్ రాకేష్ మనోచ సతీసమేతంగా జిల్లాలో ఆది, సోమవారం పర్యటించారు. ఆయనతో పాటు కల్నల్ విజయన్, స్టేషన్ హెడ్ క్వార్టర్స్ విశాఖ నుంచి కల్నల్ పాండే కూడా వచ్చారు. పలాస, శ్రీకాకుళంలో ఉన్న ఆర్మీ క్యాంటీన్లను పరిశీలించారని జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు కటకం తెలియజేశారు. మాజీ ఆర్మీ జవాన్ల కుటుంబ సభ్యులను పరిశీలించిన భరోసా ఇచ్చారని తెలిపారు.

సేద్యం.. సుసాధ్యం



- మేలు చేసిన తాజా వర్షాలు
- జిల్లాలో సాధారణ విస్తీర్ణంలో ఖరీఫ్ సాగు
- వంశధార, తోటపల్లి ద్వారా శివారు ఆయకట్టుకు అందుతున్న సాగునీరు
- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో తక్కువ ఉభాలు
- ఆ మండలాల్లో ప్రత్యామ్నాయ సాగుకు చర్యలు
- సాగు విస్తీర్ణంపై పట్టణీకరణ, ఆక్వా, మూలపేట పోర్టు ప్రభావం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : తాజాగా కురిసిన వానలు జిల్లా రైతుల నెత్తిపై పాలు పోశాయి. ఖరీఫ్ ఆరంభంలో వరుణుడు ముఖం చాటేయడంతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం తగ్గిపోతుందని అందరూ అంచనా వేశారు. కానీ ఇటీవల కురిసిన వానలు మళ్లీ పొలాలను పచ్చగా మార్చాయి. ఏటా సాగయ్యే సాధారణ విస్తీర్ణానికి దగ్గరగా ఈ ఏడాది కూడా సాగు జరుగుతోంది. ముఖ్యంగా పలాస డివిజన్‌ను తాజాగా కురిసిన వానలే కాపాడాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని మూడు మండలాలు తప్ప దాదాపు జిల్లా వ్యాప్తంగా ఆశించిన మేర సాగు జరిగింది. నీరు కూడా అందుబాటులో ఉండటంతో ఈసారి ఖరీఫ్‌కు ఢోకా ఉండదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ముందు ఉసూరుమనిపించి..

సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో వర్షాలు బాగా పడతాయి. కానీ ఈ ఏడాది జూన్‌లో తక్కువ వర్షపాతం నమోదైంది. దీంటో ఖరీఫ్ సన్నద్ధతపై కాస్త అయోమయం ఏర్పడింది. జూలైలో అనూహ్యంగా ఎక్కువ వర్షాలు పడటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ ఆగస్టులో వర్షాలు తక్కువగా పడ్డాయి. దీంతో కరువు తప్పదేమో అన్న బెంగతో ఉన్న తరుణంలో సెప్టెంబర్‌లో మళ్లీ ఆశించిన మేర వర్షాలు కురిశాయి. దీంతో సాధారణ విస్తీర్ణం మేరకు సాగు చేయగలిగారు.

వంశధార, తోటపల్లి నుంచి సాగునీరు

తొలుత వర్షాలు తక్కువగా పడటంతో సాగునీటిపై రైతులు అనుమానం పెట్టుకున్నారు. ఆశించిన మేరకు ఇన్‌ఫ్లో లేకపోవడంతో సాగునీటికి ఇక్కట్లు తప్పవని భయపడ్డారు. తర్వాత అనూహ్యంగా వర్షాలు పడటం, ఎగువ ప్రాంతాల్లోనూ వానలు కురవడంతో వంశధార, తోటపల్లి ప్రాజెక్టుల ద్వారా నీరు వచ్చి చేరింది. దీంతో శివారు ప్రాంత ఆయకట్టుకు కూడా నీరు అందే అవకాశం ఏర్పడింది. రిజర్వాయర్లలో తక్కువ నీరు ఉన్న క్రమంలో ముఖ్యంగా వంశధార కాలువల నుంచి పలాస ఏరియాకు నీరు వెళ్లని పరిస్థితి ఉండేది. వదిలిన నీరు మధ్యలో ఉన్న ఎత్తిపోతల పథకాల ద్వారా లాగేయడంతో పలాస డివిజన్‌కు సాగునీరు అందలేదు. దీంతో అక్కడ రైతులు ఆందోళన చెందడమే కాకుండా నిరసనలకు కూడా దిగారు. ఈ క్రమంలో వర్షాలు జోరుగా పడటంతో సాగునీటి సమస్య తీరింది. శివారు ప్రాంతాలకు కూడా ప్రస్తుతం సాగునీరు వెళ్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో పలాస డివిజన్ ఊపిరిపీల్చుకుంది.

ఇచ్ఛాపురంపై కాస్త ప్రభావం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. దానికి తోడు బహుదా నదిలోకి కూడా నీరు రాకపోవడంతో పరిసర ప్రాంతాల ఆయకట్టుకు నీరు అందని దుస్థితి ఏర్పడింది. దీంతో అక్కడ పూర్తిగా కరువు తప్పదేమో అనిపించింది. ఈ క్రమంలో అక్కడ కూడా వర్షాలు పడటంతో పరిస్థితి కొంతమేర సద్దుమణిగింది. జిల్లాలో దాదాపు మండలాల అన్నింటిలోనూ 85శాతానికి పైగా ఉభాలు జరగ్గా, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కంచిలిలో 26శాతం, ఇచ్ఛాపురంలో 69శాతం, సోంపేటలో 72, కవిటిలో 75 మేరకు ఉభాలు జరిగాయి. అత్యంత దారుణ పరిస్థితులు కంచిలి మండలంలో ఉన్నాయి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ఈసారి సాగు తక్కువ జరిగిన మండలాలైన కంచిలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం తదితర మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్టోబర్‌లో తుఫాన్‌లకు అవకాశం ఉండటంతో అంత వరకు ఆగి ఆ తర్వాత ప్రత్యామ్నాయ పంటలు వేయడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. నువ్వులు, మినుములు, రాగులు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే అక్కడి రైతులతో మంతనాలు జరిపారు. నవంబర్‌లో సాగు చేసేందుకు రాయితీపై అవసరమైన విత్తనాలు సరఫరా చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

పట్టణీకరణ, ఆక్వా సాగు, పోర్టు నిర్మాణంతో..

గత ఏడాది కంటే వర్షాలు కాస్త తక్కువ పడినప్పటికీ సాగు విస్తీర్ణం మాత్రం ఎప్పటిలాగానే సాధారణ స్థాయిలో జరిగింది. కాకపోతే, పట్టణీకరణ, ఆక్వా సాగు, మూలపేట పోర్టు నిర్మాణంతో కాస్తంత తగ్గింది. ముఖ్యంగా లేఅవుట్‌లు వేయడం వల్ల సాగు భూములు కాస్తా నివాసయోగ్య భూములుగా మారాయి. ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు, జి.సిగడాం, నరసన్నపేట, టెక్కలి, పొందూరు, శ్రీకాకుళం రూరల్ తదితర ప్రాంతాల్లో లేఅవుట్ల ప్రభావం కనిపించింది. ఆక్వా సాగు కూడా పెరగడంతో వరి సాగు విస్తీర్ణం తగ్గింది. వజ్రపుకొత్తూరు, నందిగాం, పోలాకి, గార, శ్రీకాకుళం రూరల్ తదితర ప్రాంతాల్లో ఆక్వా ప్రభావం చోటు చేసుకుంది. దానికి తోడు మూలపేట పోర్టు నిర్మాణంతో దాని పరిధిలో ఉన్న భూములు కాస్త సాగుకు దూరమయ్యాయి. ఫలితంగా గత ఏడాది కంటే సాగు విస్తీర్ణం తగ్గింది.

సాగు విస్తీర్ణం

ఈ ఏడాది	
వరి సాగు విస్తీర్ణం :	1,38,831 హెక్టార్లు
ఇతర పంటలు :	11,330 హెక్టార్లు
ఈ ఏడాది సాగు శాతం(ఇప్పటి వరకు) :	86 శాతం
(పట్టణీకరణ, ఆక్వా సాగు, మూలపేట పోర్టు నిర్మాణంతో తగ్గింది)	
గత ఏడాది	
వరి సాగు విస్తీర్ణం :	1,50,942 హెక్టార్లు
ఇతర పంటలు :	11,226 హెక్టార్లు
గత ఏడాది సాగు శాతం :	92 శాతం

వర్షపాతం ఇలా..

ఏటా జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 25 వరకు జిల్లా మొత్తం సాధారణ వర్షపాతం	20,430.7 మిల్లీమీటర్లు
ఈ ఏడాది జిల్లాలో నమోదైన మొత్తం వర్షపాతం	19,917.2 మిల్లీమీటర్లు
ఏటా జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 25వరకు జిల్లా సరాసరి సాధారణ వర్షపాతం	681 మిల్లీమీటర్లు
ఈ ఏడాది నమోదైన జిల్లా సరాసరి సాధారణ వర్షపాతం	663.9 మిల్లీమీటర్లు
ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్న మండలాలు	6 (జి.సిగడాం, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, నందిగాం)



ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం (మిల్లీమీటర్లలో)

జూన్‌లో ఏటా సాధారణ వర్షపాతం	134.9
ఈ ఏడాది	69.6
జూలైలో ఏటా సాధారణ వర్షపాతం	184.4
ఈ ఏడాది	319.8
ఆగస్టులో ఏటా సాధారణ వర్షపాతం	181.9
ఈ ఏడాది	128.6
సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం	195.2
ఈ ఏడాది ఇప్పటివరకు..	163.1

సాగు బాగుంది

జిల్లాలో సాగు బాగుంది. పట్టణీకరణ, ఆక్వా సాగు, మూలపేట పోర్టు తదితర వాటి కారణంగా విస్తీర్ణం కాస్త తగ్గినా మిగతాదంతా సాగులోకి వచ్చింది. సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలు మేలు చేశాయి. ప్రాజెక్టుల్లో నీరు చేరడంతో పలాస డివిజన్ తదితర ప్రాంతాలకు సాగునీరు అందుతుండటం మంచి పరిణామం. తక్కువ ఉబాలు జరిగిన మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రైతులతో సంప్రదింపులు కూడా చేశాం. – శ్రీధర్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్, శ్రీకాకుళం.



క్రీడలతో విశ్వవ్యాప్త గుర్తింపు



పోటీలకు హాజరైన బాలబాలికలు

- జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు
- జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడలతో విశ్వవ్యాప్తంగా గుర్తింపు, గౌరవం లభిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను ఉప విద్యాశాఖాధికారి గార పగడాలమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులు వ్యాయామం, క్రీడల్లో పాల్గొనేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపించాలని కోరారు. గార పగడాలమ్మ మాట్లాడుతూ జిల్లాలో పీడీలు, పీఈటీలు అత్యంత సమర్థులని, మంచి ఫలితాలను సాధిస్తున్నారని అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ నిర్వహణ కు ప్రభుత్వాలు నిధులను ప్రత్యేకంగా కేటాయించడం లేదని, దీంతో క్రీడా ఎంపికల నిర్వహణ భారంగా మారుతోందన్నారు. జిల్లా పీడీ పీఈటీ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవీ రమణ మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా జిల్లా స్కూల్‌గేమ్స్ క్రీడా జట్లు ఎంపికలను పారదర్శకంగా పూర్తిచేయాలని సెలెక్షన్ కమిటీలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, పి.తవిటయ్య, సంపతిరావు సూరిబాబు, కె.మాధవరావు, పి.రాజారావు, చల్లా జగదీష్, శ్రీనివాసరావు, నారాయణరావు, తిరుపతిరావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



కబడ్డీ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు

తొలిరోజు ఉత్సాహంగా పోరు..

జిల్లా స్కూల్‌గేమ్స్ ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. త్వరలో వివిధ జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఇక్కడ ఎంపిక చేస్తున్నారు. ఐదు రోజులపాటు జరిగే ఈ ఎంపికలు ఈనెల 29వరకు కొనసాగనున్నాయి. కాగా ఎంపికల్లో భాగంగా తొలిరోజు కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, లాన్‌టెన్నిస్, ఆర్చరీ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు జరిగాయి. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 1200 మంది వరకు బాలబాలికలకు హాజరయ్యారు. తమ ప్రతిభను నిరూపించుకున్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా క్రీడాకారులకు మధ్యాహ్నం భోజనం కల్పించారు.

గణపయ్యా.. ఆరగించవయ్యా



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎంపీడీఓ కార్యాలయం జంక్షన్ వద్ద నిర్వహిస్తున్న విఘ్నేశ్వర పూజలో సోమవారం రాత్రి స్వామికి 501 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న భక్తులంతా పలు రకాల ప్రసాదాలు చేసి స్వామిని నివేదించారు. - కాశీబుగ్గ

ఆలయ నిర్మాణాల పరిశీలన

అరసవల్లి: తిరుమల తిరుపతి దేవస్థానాల నిధులతో జిల్లాలో చేపడుతున్న పలు ఆలయాల నిర్మాణాలను సోమవారం సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు స్థానిక జిల్లా ఎండోమెంట్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్‌వీ రమణ మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణాలు జరుగుతున్న 7 ఆలయాలను పరిశీలించామని, అయితే ఇప్పటికే వివిధ స్థాయిల్లో నిర్మాణాలు జరిగిన ఆలయాలకు మాత్రమే తొలి విడత నిధులను మంజూరు చేశామన్నారు. జిల్లాలో ఈమేరకు నగరంలోని నక్కవీధి శ్రీరామమందిరం, దూసిపేటలో రామాలయం, ఆమదాలవలసలో శ్రీవిజయభవాని అమ్మవారి ఆలయం, అనంతగిరిపేటలో రామాలయం, సోమిదాలవలసలో శ్రీరామాలయం, కొత్తగూడలో కృష్ణభగవాన్ ఆలయం, బసవరాజుపేటలో చెవిటమ్మతల్లి ఆలయాలను సందర్శించామని తెలియజేశారు. జిల్లా ఎండోమెంట్ అధికారి ఎస్.చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, సహాయ ఇంజినీర్లు యశ్వంత్, జితేంద్ర ఉన్నారు.

‘జానపద కళలను బతికించుకోవాలి’



కళాకారుల నృత్యాభినయం

పలాస: జానపద కళలను బతికించుకోవాలని ప్రముఖ జానపద కళాకారుడు, సినీ నటుడు డాక్టరు కుమార్‌నాయక్ చెప్పారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన జానపద కళాకారుడు పోతపల్లి నాగు సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సోమవారం గ్రామంలో జెస్సీ ఈవెంట్స్ ఆర్గనైజరు, జైభీమ్ యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు ప్రసంగిస్తూ ఉద్దానం ప్రాంతంలో అపారమైన జానపద సంపద ఉందని, దాన్ని ప్రజల జీవితాలను బాగు చేయడానికి ఉపయోగించాలని కోరారు. ఈ సందర్భంగా నాగు జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ పలువురు కళాకారులు జానపద నృత్యాలతో అలరించారు.

ప్రయాణం మరింత సుఖవంతం

- సీనియర్ సిటిజన్స్ వినతులను మన్నించిన ప్రభుత్వం
- ఇకపై ఆర్టీసీ బస్సుల్లో ఎలాంటి గుర్తింపు కార్డు తీసుకెళ్లకున్నా రాయితీ
- ఫోన్‌లో డిజిటల్ ఆధార్ చూపిస్తే చాలు



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్

శ్రీకాకుళం అర్బన్: సీనియర్ సిటిజన్లకు ఏపీఎస్ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. గతంలో ఆర్టీసీలో ప్రయాణించే వారికి పలు రాయితీలు ఉండేవి. అయితే కరోనా సమయంలో ప్రయాణాలు అనుకున్న స్థాయిలో లేకపోవడంతో కొన్నింటిని రద్దు చేశారు. కోవిడ్ తర్వాత ఒక్కొక్కటిగా అన్నింటినీ పునరుద్ధరిస్తున్నారు. అందులో భాగంగా సీనియర్ సిటిజన్స్‌కు వయస్సు ధ్రువీకరించే ఏదైనా గుర్తింపు కార్డు ఉంటే ప్రయాణ సమయంలో చార్జీలో 25శాతం రాయితీ ఇచ్చే విధంగా ఆర్టీసీ ప్రకటించింది. ఇపుడు మరో అడుగు ముందుకేసిన ఆర్టీసీ సీనియర్ సిటిజన్స్‌కు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సీనియర్ సిటిజన్స్‌కు ఎలాంటి గుర్తింపు కార్డులూ లేకుండానే టికెట్‌పై 25శాతం రాయితీ లభించే అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వృద్ధులకు ఆరు రకాల ఐడీ కార్డులు చూపిస్తే ప్రయాణ సమయంలో టికెట్‌పై 25శాతం రాయితీ ఇస్తున్నారు. ఇందులో ఆధార్ కార్డు, పాన్‌కార్డు, ఓటరు ఐడీ, పాస్‌పోర్టు, రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ ఆరు కార్డుల్లో ఏదో ఒక కార్డు తమ వెంట తీసుకువెళ్లడంతో పాటు బస్సుల్లో కండక్టర్‌కు చూపిస్తేనే రాయితీపై టికెట్ ఇచ్చేవారు. లేకపోతే రాయితీ ఇచ్చేవారు కాదు. అయితే వృద్ధులు ప్రయాణ సమయంలో ఈ కార్డుల్లో ఏదో ఒక కార్డును తమవెంట తీసుకువెళ్లడం మరచిపోయేవారు. దీంతో వారికి రాయితీ లభించేది కాదు. ఈ నేపథ్యంలో సీనియర్ సిటిజన్స్ నుంచి ప్రభుత్వానికి పలు వినతులు అందాయి. బస్సుల్లో ప్రస్తుతం భౌతిక రూపంలో అనుమతిస్తున్న ఆరు గుర్తింపు కార్డులను డిజిటల్ రూపంలోనూ అనుమతించాలని వారు కోరారు. ఈ వినతులను పరిశీలించిన ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ అభ్యర్థనలను మన్నించింది. దీంతో ఇకపై ఈ గుర్తింపు కార్డులను ఫోన్‌లో డిజిటల్ రూపంలో ఉన్నా రాయితీకి అనుమతించేలా ఆర్టీసీకి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అయితే ఇందులో ఆధార్ కార్డు మాత్రమే డిజిటల్ రూపంలో ఉండడంతో దాన్ని మాత్రమే అనుమతిస్తారు. ఆర్టీసీ బస్సుల్లో ఇచ్చే టికెట్‌లతో పాటు ఆర్టీసీ ఓపీఆర్ఎస్‌కౌంటర్‌ఖలలోనూ, ఏటీబీ ఏజెంట్ల ద్వారా ఇచ్చే టికెట్లకు ఇదే నిబంధన వర్తింపజేయాలని ఆర్టీసీ ఈడీ, డీఎంలకు, సూపర్‌వైజర్‌లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ మూడుచోట్ల కూడా వృద్ధులు కేవలం ఆధార్‌కార్డు ఫోన్‌లో చూపించి 25శాతం రాయితీపై టికెట్‌లు పొందేందుకు అవకాశం లభించింది. ప్రభుత్వ నిర్ణయంపై సీనియర్ సిటిజన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తాం

సీనియర్ సిటిజన్స్ విన్నపం మేరకు వయస్సు ధ్రువీకరణకు సంబంధించిన ఏదైనా ఐడీ సెల్‌లో చూపిస్తే అనుమతించాలని ఆర్టీసీ ఎండీ ఆదేశాలు జారీ చేశారు. సీనియర్ సిటిజన్ ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూస్తాం.

– ఎ.విజయ్‌కుమార్, డీపీటీఓ

ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం



ఆర్టీసీలో సీనియర్ సిటిజన్స్ ప్రయాణ రాయితీపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఆర్టీసీ ప్రయాణం అంటే సురక్షితం సుఖవంతం అనే నానుడి వల్ల సీనియర్ సిటిజన్స్ అంతా ఆర్టీసీలోనే ప్రయాణిస్తుంటారు. అలాంటి వారికి ఇది ఎంతో ఉపయోగకరం. సీనియర్ సిటిజన్స్‌కు ఇచ్చే 25శాతం రాయితీని ప్రభుత్వం ముందు ముందు మరింతగా పెంచాలి.

– పైడి వేణుగోపాలం, బీజేపీ రాష్ట్ర నాయకుడు

సంతోషకరం



ఏదైనా గుర్తింపు కార్డు చూపిస్తే తప్ప ప్రయాణ సమయంలో టికెట్ రాయితీ ఇచ్చేవారు కాదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల సెల్‌ఫోన్‌లో గుర్తింపు కార్డు భద్రపరచుకుంటే చాలు. గుర్తింపు కార్డును వెంట తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఉండదు. ప్రయాణ హడావుడిలో కొన్ని సందర్భాల్లో వయస్సు ధ్రువీకరణ కార్డును మరచిపోతుంటారు. ఆర్టీసీ కండక్టర్ అడిగినపుడు గుర్తుకు వస్తుంది. కార్డు లేకపోవడంతో ఫుల్ చార్జీ చెల్లించాల్సి వచ్చేది. ఇపుడు అలాంటి పరిస్థితి ఉండదు.

– పాలకొండ అప్పారావు, విశ్రాంత ఉద్యోగి